# గజల్ శ్రీనివాస్ 'శాంతియాత్ర' సి.డి. ఆవిష్కరణ



ప్రముఖ తెలుగు గజల్ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ గానం చేసిన 'శాంతి యాత్ర' ఉర్దూ ఆడియో ఆల్బమ్ సెప్టెంబర్ 17వ తేదీన పాకిస్థాన్‌లోని లాహోర్ నగరంల్గో ఆవిష్కరించారు. యాత్ర విశేషాలను శ్రీనివాస్ ఒక ప్రకటనలో వివరించారు. భారత- పాక్ దేశాల మధ్య ఎల్లవేళలా శాంతిని ఆకాంక్షిస్తూ జరిపిన శాంతియాత్రలో భాగంగా లాహోర్ యువత ఈ సి.డిని ఆవిష్కరించింది. శాంతి యాత్ర జరిపిన బృందానికి డాక్టర్ సందీప్ పాండే నేతృత్వం వహించారు. బృందంలో గజల్ శ్రీనివాస్‌తో పాటు సీమా సెహగల్, ఫైజల్ అహ్మద్, రాణా, హర్షవర్ధన్, బౌద్ధ బిక్షువు తెన్సింగ్, ఫాదర్ ఆనంద్ తదితరులు సభ్యులుగా ఉన్నారు. ఉభయ దేశాల మధ్య శాంతిని కోరుకుంటూ బృందంలోని సభ్యులు ఒకరోజు నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15వ తేదీన పాకిస్థాన్ మానవ హక్కుల సంఘం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక ఉర్దూ గజల్ కచేరి నిర్వహించారు.

16వ తేదీన లాహోర్ ప్రెస్‌క్లబ్‌లో 'వీసా ఫ్రీ సౌత్ ఏసియా పీస్ కాన్ఫరెన్స్' జరిగింది. పాకిస్థాన్ మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ ముబ్షార్ హుసేన్, బారాముల్లా ప్రాంత పార్లమెంట్ సభ్యుడు ఎ.ఆర్. షహీం, శ్రీమతి నిఘాత్ సయీద్ ఖాన్, శ్రీమతి అస్మా జహంగీర్ తదితరులు పాల్గొన్నారు. యుద్ధం వల్ల కలిగే అశాంతి, పరిణామాలు, ఆర్థిక, సామాజికాంశాలపై ప్రభావం, దక్షిణాసియాలో శాంతి ఆవశ్యకత, దక్షిణాసియా దేశాల నడుమ వీసా రహిత ప్రయాణ అవసరం, ప్రజాస్వామ్య విలువల, పర్యావరణ పరిరక్షణ తదితరుల అంశాలపై ప్రసంగించారు.